క్లుప్తంగా

మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ


దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : మానవతావాదాన్ని అందించిన మహోన్నత వ్యక్తి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన భావజాలం ఆధునిక భారత రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపించిందన్నారు. సమాజంలో ప్రతీ వ్యక్తి భౌతిక, ఆధ్యాత్మిక, మానసిక అభ్యున్నతికి ఆయన ప్రాముఖ్యమిచ్చారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సురేష్‌బాబు, పృధ్వీ రాజ్, శంకరరావు, రాకేష్, పోతురాజు, ఆశీర్వాదం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

సీతంపేట : ఆంధ్రా యూనివర్సిటీ హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలోని సెమినార్ హాలులో పోషకాహార ఆవశ్యకతపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీ ఫార్మా లిమిటెడ్ సంస్థల డైరెక్టర్ ఆళ్ల లీలారాణి, చర్మరోగ వైద్య నిపుణులు డి.గోపీచంద్ మాట్లాడుతూ పోషకార ఆవశ్యకత, ఆహారపు అలవాట్లు, పాటించాల్సిన నియమాలు వివరించారు. పోషకాహారంతోనే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ యం.వి.ఆర్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పది కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : గుట్టుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన సద్దాం అహ్మద్ (24), కె.ఎం.ప్రజ్వల్ (24) ఒడిశాలో పది కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి కర్ణాటక తరలించేందుకు నగరానికి తీసుకొచ్చి రామాటాకీస్ దరి కంటి ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి ద్వారకా పోలీసులు వారి బ్యాగులు తనిఖీ చేశారు. బ్యాగుల్లో రెండు ప్యాకెట్ల గంజాయి లభ్యమవడంతో స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి.వెంకటరమణ నేతృత్వంలో ఎస్ఐ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోకేష్‌ను కలిసిన విష్ణుకుమార్‌రాజు


లోకేష్‌ను సత్కరిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : విశాఖ నగరానికి వచ్చిన మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం పలు అంశాలపై కొద్ది సేపు చర్చించారు.

విశేషంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీతధారణ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

అసంపూర్తిగా వదిలేశారు

- వైఎస్సార్ నగర్‌లో సామాజిక భవనానికి గ్రహణం
- నిధులు సరిపోలేదని చేతులెత్తేసిన కాంట్రాక్టర్


అత్యాధునిక వసతులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన గ్రౌండ్ ఫ్లోర్


వైఎస్సార్ నగర్‌లో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన సామాజిక భవనం

తాటిచెట్లపాలెం : అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని అన్నట్లు తయారైంది వైఎస్సార్‌నగర్ వాసుల పరిస్థితి. సకల హంగులతో ఆధునిక సామాజిక భవనం నిర్మించినా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. పేద, మధ్య తరగతి ప్రజలకు, పరిసర కాలనీల వాసులకు ఉపయోగపడేలా అత్యాధునిక వసతులతో జీవీఎంసీ 45వ వార్డు పరిధి వైఎస్సార్ నగర్‌లో నిర్మించిన సామాజిక భవనాన్ని జీవీఎంసీ అధికారులు, కూటమి పాలకులు అసంపూర్తిగా వదిలేశారు. వైఎస్సార్ నగర్‌లో 2019కు ముందు జీ ప్లస్ వన్ తరహాలో సామాజిక భవనం కోసం అప్పటి పాలకులు శంకుస్థాపన చేసి, ఒక ఫ్లోర్ స్లాబ్ వేసి వదిలేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాంత వాసులు శుభకార్యాలు, ఫంక్షన్లు జరుపుకునేందుకు అనువుగా అదనపు సదుపాయాలతో ఆధునిక సామాజిక భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. నాటి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు చొరవతో ప్రభుత్వం 57.38 లక్షలు కేటాయించింది. ఆ నిధులతో కింది అంతస్తులో మొత్తం పనులు పూర్తయిపోయాయి. కార్పొరేట్ ఫంక్షన్ హాల్‌ను తలపించేలా మార్బుల్ ఫ్లోరింగ్, సీలింగ్, లైటింగ్, ఫ్యాన్స్ ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో మాత్రం కొంచెం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సామాజిక భవనం మొత్తానికి వాష్ రూమ్‌లు లేవు. నిధులు సరిపోలేదని కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో చిన్నచిన్న పనులు అలాగే మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులు పూర్తి చేసి సామాజిక భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడంపై కనీసం దృష్టి సారించలేదు. జీవీఎంసీ అధికారులు కూడా కనీసం దృష్టి సారించడం లేదు. ప్రస్తుతానికి కింద భవనాన్ని మాత్రమే స్థానికులు వినియోగిస్తున్నారు. పక్కనే ఉన్న అన్నా క్యాంటీన్‌కు సుమారు రూ.10 లక్షలు వెచ్చించి ఆగమేఘాలపై పనులు పూర్తి చేశారని... అలాగే కమ్యూనిటీ హాల్‌లో మిగిలిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

కేకే రాజు చొరవతో వసతులు

గత ప్రభుత్వంలో కేకే రాజు గారి చొరవతో మా ప్రాంతంలో సామాజిక భవనం పనులు దాదాపు పూర్తి చేశారు. కానీ వాష్ రూమ్‌లు లేవు. ఈ పరిస్థితుల్లోనే గ్రౌండ్ ఫ్లోర్‌ను వాడుకుంటున్నాం. ఇంకా కొన్ని పనులు వదిలేశారు. వాటిని కూడా పూర్తి చేస్తే సామాజిక భవనం మాకు చాలా సౌకర్యంగా ఉంటుంది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజు చొరవతో ప్రత్యేకంగా ఆధునిక వసుతులు సమకూర్చారు.

– దుర్గా ఈశ్వరరావు, వైఎస్సార్ నగర్

వినియోగంలోకి తీసుకురావాలి

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైఎస్సార్ నగర్‌లో గల సామాజిక భవనాన్ని వదిలేశారు. మా సమీప ప్రాంతాల్లో గల ప్రజలకు ఈ సామాజిక భవనం చాలా ఉపయోగపడుతుంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఎంతో సుందరంగా భవనాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించింది. కానీ చివరలో చిన్న పనులు పూర్తి చేయలేదు. వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– ధనలక్ష్మి, చిట్టిబాబుకాలనీ

గుజరాతీ కార్పొరేట్ వలస దోపిడీని ఎదురిద్దాం


జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న వెంకటరెడ్డి, తదితరులు

సీతమ్మధార : గుజరాతీ కార్పొరేట్ వలస దోపిడీని ఎదిరిద్దామని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగంతో ఆవిర్భవించిన ప్లాంట్‌ను అప్పనంగా బడా వ్యాపారులకు విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. అంబానీ, రిలయన్స్ తదితర ఉత్పత్తులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఆనాడు సీపీఎం, సీపీఐ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేసి స్టీల్‌ప్లాంట్ సాధనకు కృషి చేశారన్నారు. ఈ రోజు ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ లేని విశాఖ నగరాన్ని ఊహించుకోలేమన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


శ్రీలలిత పీఠంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీతంపేట : అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో శ్రీ భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. ఆలయంలో ఉత్సవ విగ్రహాలు ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పీఠం దర్బారు హాల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు తిరుపతి ఆగమ సాంప్రదాయం ప్రకారం వైభవంగా కల్యాణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణం వీక్షించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మధ్యాహ్న భోజనంలో గుడ్లు అందజేత


విద్యార్థిని కంచంలో గుడ్డు


విద్యార్థుల కోసం ఉడకబెడుతున్న గుడ్లు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం మధ్యాహ్న భోజనంలో గుడ్లు అందించారు. ఈ పాఠశాలను సీతమ్మధార మండల ఎంఈవో – 2 బాలమణి మంగళవారం పరిశీలించారు. అయితే ఆ సమయంలో పిల్లలకు మధ్యాహ్న భోజనంతో గుడ్లు అందించ లేదు. ఇదేమని 'సాక్షి' విలేకరి ప్రశ్నిస్తే... గ్యాస్ సిలిండర్ లేకపోవడంతో గుడ్లు ఇవ్వలేదని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సమాధానమిచ్చారు.

అదే విషయంపై సాక్షిలో బుధవారం వార్త ప్రచురితమవడంతో నిర్వాహకులు స్పందించారు. రెండు రోజులకు సంబంధించి 992 గుడ్లు ఉడకబెట్టి విద్యార్థులకు అందజేశారు.

ఉత్కంఠగా వుమెన్ బాక్సింగ్ పోటీలు


విజయం సాధించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించిన మోనిక

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా అంతర రైల్వేస్ వుమెన్ బాక్సింగ్ పోటీలు బుధవారం ఉత్కంఠగా సాగాయి. ఈకోర్స్టా వాల్తేర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో రెండో రోజు క్వార్టర్ ఫైనల్స్‌లో పలు జోన్లకు చెందిన మహిళా బాక్సర్లు విజయం సాధించి సెమీస్‌లో తలపడ్డారు. 81కేజీల వెయిట్ కేటగిరిలోసెంట్రల్ రైల్వే బాక్సర్ 5–0తో నార్త్ వెస్ట్రన్ రైల్వే బాక్సర్‌పై విజయం సాధించింది. 81+కేజీల వెయిట్‌లో నార్త్ వెస్ట్రన్ రైల్వే బాక్సర్ 5–0తో నార్దన్ రైల్వే బాక్సర్‌పై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఈస్ట్ కోస్ట్ రైల్వే 5–0తో ఆస్ట్రన్ రైల్వేపై విజయం సాధించింది. 50 కేజీల వెయిట్‌లో ఈస్ట్రన్ రైల్వే 4–1తో నార్త్ వెస్ట్రన్ రైల్వేపై, 52కేజీల వెయిట్‌లో నార్దన్ రైల్వే 4–1తో ఈస్ట్‌కోస్ట్ రైల్వేపై, సౌత్‌ఈస్ట్ సెంట్రల్ రైల్వే 5–0తో నార్త్ వెస్ట్రన్ రైల్వేపై విజయం సాధించింది. 60 కేజీల వెయిట్‌లో హోరాహోరీగా సాగిన పంచ్ పోరులో నార్త్ ఫ్రాంటియర్ రైల్వే 4–1తో ఈస్ట్ కోస్ట్ రైల్వేపై విజయం సాధించింది.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో రమాబాయి, అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేసిన అనంతరం కొత్త చీర, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, పెదవాల్తేరు, లలితానగర్, శంకరమఠం, సీతంపేట, రామాటాకీస్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయం తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న గ్రంథాలయ కార్యదర్శి వెంకటరావు

అల్లిపురం: అల్లిపురంలోని బాయమ్మ జంక్షన్‌లో గల శాఖా గ్రంథాలయాన్ని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకటరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో పుస్తకాల అమరికను పరిశీలించిన ఆయన పాఠకులతో కొంత సేపు ముచ్చటించారు. గ్రంథాలయంలోని సౌకర్యాల గురించి ఆరా తీశారు. పాఠకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రంథాలయాధికారి పీవీ నూకరాజుకు సూచనలు చేశారు. పాఠకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ


కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మర్రిపాలెం : కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బుధవారం రాత్రి సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులకు సంబంధించిన వివరాలను క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ప్రతీ క్రైం రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. నేరాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సిబ్బందికి తెలిపారు. ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరును ఆరా తీశారు. అలాగే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులున్నా తెలియజేయాలన్నారు. పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లపై నిఘా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. క్రైం డీసీపీ లతా మాధురి ఉన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బందులు



జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో తరలించకుండా వదిలేసిన చెట్ల కొమ్మలు

సీతంపేట : విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో పలు వీధుల్లో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను వినాయక చవితి ముందు విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. మూడు వారాలు గడుస్తున్నా అక్కడి నుంచి ఆ కొమ్మలు మాత్రం తరలించ లేదు. దీంతో ఇళ్ల ముందు చెట్ల కొమ్మలు ఎండిపోయి, ఆకులు గాలికి ఎగురుతూ రోడ్డంతా వ్యాపిస్తున్నాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షంతో ఎండిన ఆకులు తడిసి ఇళ్ల ముందు చిత్తడిగా మారిందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే లారీల్లో తరలించే వారని, ప్రస్తుతం తరలింపు విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తెన్నేటి పార్కు పరిశుభ్రతకు చర్యలు


తెన్నేటిపార్కులో సేవా సంఘం సభ్యులు

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని పార్కుల్లో పరిశుభ్రతకు జీవీఎంసీ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు తెన్నేటి పార్కులో తెన్నేటి విశ్వనాథం సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ సిబ్బంది సహకారంతో పార్కులో పరిశుభ్రత, పచ్చదనం పరిరక్షణకు చర్యలు చేపట్టారు. పార్కులోని పిచ్చి మొక్కలు, చెత్త తొలగించి సుందరీకరణ మొక్కలను ప్రూనింగ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పాల్గొని సహకరించారు. పార్కు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తామని తెన్నేటి విశ్వనాథం సేవా సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నంబాల ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, పీసాన రాము, కోశాధికారి సనపల విజయ్, సంఘం సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పార్కును అందంగా తీర్చిదిద్దారు.

ఉల్లి కోసం క్యూ

కిటకిటలాడిన సీతమ్మధార రైతుబజార్


ఉల్లి కోసం క్యూ కట్టిన వినియోగదారులు

సీతమ్మధార : ఉల్లి మళ్లీ కన్నీళ్లు పెట్టిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉల్లి పంట బాగా దెబ్బతినడంతో దిగుబడి తగ్గి ధరలు పెరిగాయి. ఈ క్రమంలో మహారాష్ట్ర, నాసిక్ నుంచి విశాఖకు ఉల్లి దిగుమతి అవుతుంది. కర్నూలు ఉల్లి రూ.36కు లభిస్తున్నా చిన్నవి కావడంతో వినియోగదారులు కొనుగోలు చేయడం లేదు. ఉల్లి కొరతతోపాటు ధరలు పెరిగిపోవడంతో వినియోగదారులు క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సీతమ్మధార రైతుబజారులోని ఉల్లి కౌంటర్ల వద్ద వినియోగదారులు బారులు తీరారు. బుధవారం ఉదయం రెండు కౌంటర్ల వద్ద ఉల్లి విక్రయాలు ప్రారంభించడంతో వినియోగదారులు భారీగా చేరుకున్నారు. దీంతో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు వెంటనే మరో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. గత వారం కిలో ఉల్లి రూ.52 ఉండగా, ఈ వారం రెండు రూపాయలు పెరిగి రూ.54 అయ్యింది. మరోవైపు టమాట ధరలకు కూడా రెక్కలొచ్చాయి. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం బుధవారం కిలో టమాటా రూ.46కు పెరిగిపోవడంతో ఆ కౌంటర్ల వద్దకూ భారీగా వినియోగదారులు చేరుకున్నారు. మొత్తంగా రైతుబజారు వినియోగదారులతో కిటకిటలాడింది. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు పర్యవేక్షించారు.

వైద్య రంగంలో ఫార్మాసిస్టులకు ప్రాధాన్యం


రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీతో విద్యార్థులు

మురళీనగర్ : వైద్య రంగంలో ఫార్మసీ నిపుణులకు అత్యంత ప్రాధాన్యత ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రోగులను వైద్యులు పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేసిన తర్వాత వాడాల్సిన మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసేది ఫార్మసిస్టులే అని పేర్కొన్నారు. మందుల వాడకంలో మన సొంత పరిజ్ఞానాన్ని వాడకూడదన్నారు. ఈ విషయంలో ఫార్మసీ విద్యార్థులు పరిసరాల్లోని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. వైద్యులతో కలిసి ఫార్మాసిస్టులు పనిచేస్తేనే పూర్తి స్థాయి వైద్యం అందుతుందని ఆయన వివరించారు.

ఫార్మాసిస్టులకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. అనంతరం డాక్టర్ విలియం క్యారీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలేజీ ఫార్మసీ విభాగం హెడ్ గోవర్ధన రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగం హెడ్ కేడీవీ నరసింహారావు, సివిల్ హెడ్ రాజేంద్రప్రసాద్, స్టూడెంట్ అడ్వైజర్ రమణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా కరపత్రాల ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి విజయకుమార్ తదితరులు

మహారాణిపేట: మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలు తెలిపే కరపత్రాలను బుధవారం పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఉమ్మడి విశాఖ జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎస్.విజయకుమార్ ఆవిష్కరించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలనా శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.లక్ష్మి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, మత్తు మందుల నివారణ, వాటి వల్ల కలిగే దుష్ఫలితాలను కరపత్రాలు, పోస్టర్ల ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగించనున్నారు. అదే విధంగా ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా పలువురు ఫార్మసిస్టులను సత్కరించారు. పెందుర్తి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నమెంటు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, పెందుర్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.కళ్యాణి, ఎం.శ్రీనివాసరావు, ఎస్.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

8వ పే కమిషన్ ఏర్పాటు చేయాలి

సీతమ్మధార: 8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్లు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్‌ను అప్డేట్ చేయాలన్నారు. కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.